క్లుప్తంగా

వరద పరిహారం అందరికీ ఇవ్వాలి

చింతూరు: వరద నష్ట పరిహారం చింతూరులో అన్ని కుటుంబాలకు అందించాలని బీజేపీ నాయకులు కోరారు. ఆదివారం చింతూరులో పార్టీ జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య, మండల పార్టీ అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ స్థానిక అధికారులు పరిహారం అందించే విషయంలో కలెక్టర్, ఐటీడీఏ పీవోను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. జూలై నుంచి ఇప్పటివరకు మూడుసార్లు వరదలు రావడంతో రైతులు పంటలు నష్టపోయారని, ఉపాధి పనులు లేకుండా పోయాయని వారు తెలిపారు. గ్రామం చుట్టూ నీరు చేరడంతో ఆటో కార్మికులు, చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురవగా అధికారులు చింతూరులో కొంతమంది పేర్లు మాత్రమే నమోదు చేశారని వారు తెలిపారు. గ్రామంలోని అందరికీ వరద పరిహారం రూ.10 వేలు అందించాలని వారు డిమాండ్ చేశారు.

ఇంటి నిర్మాణ సామగ్రి వితరణ



బాధితుడికి సామగ్రి అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి

చింతూరు: వర్షాల కారణంగా ఇల్లు కూలిన బాధితుడికి జమాల్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. బాధితుడు గుడ్ల కనకారెడ్డి ఇల్లు కూలిన విషయం తెలుసుకున్న ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ తన ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణానికి కావాల్సిన పైకప్పు రేకులు, ఐరన్‌పైపులు తదితర సామగ్రిని అంజేశారు. ఆయన సేవలకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. ట్రస్ట్ కార్యదర్శి ఇమ్రాన్‌ఖాన్, అబ్రార్‌ఖాన్, రియాజ్, శ్రీరామ్, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం


కిరసాని రామారావు (ఫైల్)

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ గ్రామంలో ఉపాధ్యాయుడు కిరసాని రామారావు(58) శనివారం రాత్రి 11గంటల సమయంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం తన కుమారుడు కిరసాని రమేష్ తెలిపిన వివరాల ప్రకారం తన తండ్రి కిరసాని రామారావు అనంతగిరి మండలం బొర్రా ఆశ్రమ పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నట్టు తెలిపారు. శనివారం రాత్రి 11గంటల సమయంలో హఠాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందినట్టు తెలిపారు. రామారావు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి(అరకులోయ రూరల్): మండలంలో టోకురు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల వసతి గృహాన్ని జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల, వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, హెచ్‌ఎం స్వరూపరాణి, డిప్యూటీ వార్డెన్ శైలజ, సర్పంచ్ కిల్లో మొశ్య పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి

చింతూరు: ఇటీవల వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులకు సాపిడ్ స్వచ్ఛంద సంస్థ బాసటగా నిలిచింది. అందేరీ హై లైఫ్ సహకారంతో మండలంలోని 20 గ్రామాలకు చెందిన 600 మంది రైతులకు మినుములు, పెసలు, జొన్న విత్తనాలను ఉచితంగా అందించారు. ఈ అవకాశాన్ని గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ మీరాఖాదర్ తెలిపారు. కో-ఆర్డినేటర్ అహ్మద్‌అలీ, ఉర్మిదాస్, నాగరాజు, జానకి, మేరీ, లక్ష్మీ పాల్గొన్నారు.

దారులు దారుణం

- అధ్వానంగా కుజభంగి- రూడకోట తారురోడ్డు
- అడుగడుగునా గోతులు
- ప్రమాదాల బారిన వాహనచోదకులు
- ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


పర్రెడ జంక్షన్ సమీపంలో పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తున్న రోడ్డు


రూడకోట గ్రామ రహదారి దుస్థితి

పెదబయలు: పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలను కలుపుతూ నిర్మించిన తారురోడ్డు గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. ముంచంగిపుట్టు మండలం కుజభంగి జంక్షన్ నుంచి రూడకోట వరకు నాలుగేళ్ల క్రితం నిర్మించిన ఈ తారురోడ్డు గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కుజభంగి నుంచి రూడకోట వెళ్లే దారిలో ఉన్న బంగారుమెట్ట, పర్రెడ, పెద్దాపుట్టు, పెద్దాపుట్టు ఘాటీ. రూడకోట గ్రామ సమీపంలోని ప్రదేశాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. గోతుల్లో పడి వాహనచోదకులు గాయాల పాలవుతున్నారు.

కోతకు గురైన దారి.. నిలిచిన ఆర్టీసీ సర్వీసులు

పాడేరు నుంచి కుమడ వయా ముంచంగిపుట్టు మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసు ఉండేది. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కర్రిముక్కిపుట్టులో కల్వర్టు కోతకు గురికావడంతో ఈ సర్వీసును కుజభంగి జంక్షన్ మీదుగా కుమడ వరకు మాత్రమే నడుపుతున్నారు. అయితే కుజభంగి నుంచి రూడకోట వరకు రోడ్డు గుంతలు ఏర్పడి ఉండడంతో అవస్థలు పడుతున్నారు. అలాగే రూడగోమంగి సమీపంలోని ఘాట్‌లో ఇటీవల వర్షాలకు కోతకు గురైయింది. అయితే తప్పని పరిస్థితిలో బస్సు నడుపుతున్నారు. ఇటీవల వర్షాలకు మరింతగా ఈ రోడ్డు బాగా దెబ్బతిందని, అత్యవసర పరిస్థితిల్లో 108., 104 ఇతర వాహనాలు రావడానికి ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక రోగులకు వైద్య సేవల కోసం డోలీమోతతో కొంతదూరం తీసుకెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుజభంగి నుంచి రూడకోట వరకు పెద్ద పెద్ద గోతులున్న రహదారి బాగు చేయాలని పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన బంగారుమెట్ట, పర్రెడ,రూడకోట ,బొండాపల్లి, కుమడ, కొరవంగి బాబుశాల, బూసిపుట్టు గ్రామస్తులు కోరుతున్నారు.

ఈ సమస్యపై గిరిజన సంక్షేమ శాఖ, డీఈఈ (పాడేరు) మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు కుజభంగి–రూడకోట రోడ్డు గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు తగ్గిన తరువాత రోడ్డు మరమ్మతు పనుల కోసం ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. నిధులు మంజూరైతే రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు. మండలంలో పలుచోట్ల పాడైనా రహదారులకు మరమ్మతు పనుల కోసం ప్రతిపాదనలు చేస్తామన్నారు.

బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ


బాధిత గిరిజనులకు నిత్యవసరాలను అందిస్తున్న ఉద్యోగులు

గూడెంకొత్తవీధి: కొండచరియలు విరిగిపడిన ఘటనలో దీనావస్థలో బతుకులు వెళ్లదీస్తున్న గూడెం కొత్తవీధి మండలంలోని చట్రాపల్లి, మాదిగమళ్ల, నిమ్మచెట్టు గ్రామాల గిరిజనులకు దాతలు బాసటగా నిలుస్తూ ఔదార్యాన్ని చాటుతున్నారు. హుకుంపేట మండలంలోని పలు శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులంతా ఏకమై సుమారు రూ.60వేల విలువ గల నిత్యావసరాలు, దుప్పట్లు, వంట సామగ్రి, గిరిజనులకు ఉపయోగపడే ఇతర వస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. కొండచరియలు విరిగిపడిన ఘటనలో గూడెం కొత్తవీధి మండలం చట్రాపల్లితో పాటు నిమ్మచెట్టు మాదిగమళ్ల గ్రామాల గిరిజనులు నష్టపోయారు. వారందరికీ ఇప్పటికే పలు గ్రామాలకు చెందని దాతలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమ వంతు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో హుకుంపేటకు చెందిన ఉపాధ్యాయులు కంఠం నాయుడు, మత్యరాజు, రత్నకుమారి, శాంతికుమారి, రమ్యప్రియ, పార్వతి, రాజేశ్వరి, వీఆర్వో సంధ్యకళ, సత్యవతి మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి విగ్రహాల నిమజ్జనం


పాడేరులో గణనాథుని విగ్రహంను ఊరేగిస్తున్న దృశ్యం


జోలాపుట్టులో ఉత్సవ కమిటీ నుంచి లడ్డును అందుకున్న భక్తుడు

సాక్షి, పాడేరు: పట్టణంలోని పాతబస్టాండ్, సినిమాహాల్ సెంటర్‌లో వినాయకచవితి ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గణపతి విగ్రహాల నిమజ్జనంలో సందడి నెలకొంది. యువతీ, యువకుల డ్యాన్సులన నడుమ ఊరేగింపు సాగింది. అనంతరం చిలకలమామిడి గెడ్డలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని నృత్యాలు, టపాసుల మోతతో భారీగా ఊరేగించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంపాటలో బోండ్రుగూడ గ్రామానికి చెందిన వార్డు మెంబర్ శుక్ర రూ.17వేలకు లడ్డును దక్కించుకున్నారు.అనంతరం జోలాపుట్టు జలాశయంలో వినాయకుడి ప్రతిమను నిమజ్జనం చేశారు. సర్పంచులు నీలకంఠం, గంగాధర్, ఎంపీటీసీ కమల, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, నేతలు మణి, సోలెమాన్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు


పెదగరువు పాఠశాలలో పారిశుధ్య పనులు చేస్తున్న హైవే సిబ్బంది

హుకుంపేట: జాతీయ రహదారి నిర్మాణంలో రహదారికి ఆనుకొని ఉన్న గ్రామాల్లో అపరిశుభ్రత లేకుండా పారిశుధ్య పనులు చేపడతామని ఎస్‌ఆర్‌కె–టీఎస్‌ఆర్ ప్రాజెక్టు మేనేజర్ అలీఖాన్ తెలిపారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అరుకు పాడేరు ప్రధాన రహదారి హైవే మార్గంలోని పెదగరువు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హైవే నిర్మాణ సిబ్బంది ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సిబ్బందితో ముందుగా గ్రామాల్లో, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పారిశుధ్య పనులు చేస్తు న్నామన్నారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

అడ్డతీగల/కొయ్యూరు: మండలంలోని దొంగమడుగల, ధాన్యంపాలెం గ్రామాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలపై గ్రామస్తులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. కొయ్యూరు మూలపేట పంచాయతీ మర్రిపాలెం ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్ల టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, జీసీసీ మాజీ చైర్మన్ ప్రసాద్, ఎంపీడీవో మేరీరోజ్ , నేతలు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం

జి.మాడుగుల/కొయ్యూరు: జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఆదివారం కుండపోత వర్షం కురిసింది. జి.మాడుగుల మండలంలోని సాలభం, గడుతూరులో ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. రహదారులు కోతకు గురయ్యాయి. గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.


కామోటమ్మ ఘాట్‌రోడ్డుపై కొండచరియలు


కొయ్యూరులో కురుస్తున్న వర్షం

సీపీఎం జెండా ఆవిష్కరణ


జెండాకు వందనం చేస్తున్న పార్టీ నాయకులు

డుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో ఆదివారం సీపీఎం శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం ప్రతినిధులు టి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన కేంద్ర సీపీఎం కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరావు మాట్లాడుతూ ఏజెన్సీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెంచిన అధిక ధరలు నియంత్రించి, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, పీవీటీజీలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేసే దిశగా కూటమి ప్రభుత్వానికి కోరారు. సత్యనారాయణ, మంజూల, పూర్ణిమ, పాపారావు పాల్గొన్నారు.

రూడకోటలో స్వచ్ఛత అభియాన్


రూడకోట పీహెచ్‌సీ ఆవరణలో పారిశుధ్య పనులు చేస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

పెదబయలు: మండలంలోని రూడకోట పోలీసు ఔట్ పోస్టు సీఆర్‌పీఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో స్వచ్ఛత అభియాన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. రూడకోట కూడలితో పాటు పీహెచ్‌సీ ఆవరణలో పారిశుధ్య పనులు చేశారు. రహదారులకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు. సీఆర్పీఎఫ్ 198 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలను వాడాలని, వర్షాలకు వ్యాధులు ప్రబలుతుందని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. సీఆర్పీఎఫ్ పోలీసులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి గంటల వితరణ


ఆలయ కమిటీ సభ్యులకు ఇత్తడి గంటలను అందజేస్తున్న దాతలు

సాక్షి,పాడేరు: ఉమానీలకంఠేశ్వరస్వామి సమేత రాజరాజేశ్వరి దేవాలయానికి 30 కిలోల ఇత్తడి గంటలను దాతలు వితరణ చేశారు.పాడేరుకు చెందిన బైరం వెంకటగణపతి, రాశి, బైరం అప్పారావు, నాగలక్ష్మి దంపతులు ఆదివారం ఆలయ ఆధ్మాతిక కమిటీ సభ్యులకు ఆయా గంటలను అందజేశారు. అర్చకుడు రామంపంతులు, ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు, రమాదేవి, ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, రాజబాబు, ముకుందరావు, శ్రీనివాస్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.


జలతరంగణి జలపాతం వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడి రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వైద్య విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు మోసం


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు సిద్దార్థదొర, ఎంపీటీసీ పద్మావతి, సర్పంచ్‌లు లీలావతి, బుల్లబ్బాయి, సత్యవతి తదితరులు

గంగవరం: ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను చంద్రబాబు గాలికి వదిలేసి ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగ అధ్యక్షుడు పండా సిద్ధార్థ దొర , సూరంపాలెం ఎంపీటీసీ సభ్యురాలు కుంజం పద్మావతి, జగ్గంపాలెం, జియ్యంపాలెం సర్పంచ్‌లు తుర్రం లీలావతి, చోడి బుల్లబ్బాయి దొర, మండల మహిళా నాయకురాలు కుంజం సత్యవతి తదితరులు చెప్పారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ప్రజా సంక్షేమాన్ని అటకెక్కించి ప్రభుత్వ సొమ్ముతో వందరోజుల కార్యక్రమాలు జరుపుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తూ నిందలు మోపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. వారు మాట్లాడుతూ మహిళ సాధికారిత అంటూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మహిళలకు ఉచిత బస్సు ప్రమాణం, గ్యాస్ బండలు ఏమి అయ్యాయని ప్రశ్నించారు. జగ్గంపాలెం సచివాలయ మాజీ కన్వీనర్ శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు తమ్మన్నదొర పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం తగదు


ఎంపీపీ రమేష్

కొయ్యూరు: రాజకీయ కక్షలతో తిరుపతి లడ్డుపై చంద్రబాబు నాయుడు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని ఎంపీపీ బడుగు రమేష్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి లడ్డూకు సంబంధించి జూలై 28న నివేదిక వస్తే ఇప్పటివరకు ప్రభుత్వం ఎందుకు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. వంద రోజుల పాలనలో చంద్రబాబు ఏ పథకాన్ని అమలు చేయకుండా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కాలం గడిపారని, దీన్ని కప్పిపుచ్చుకోవడానికి రాజకీయ కక్షలతో తప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరమన్నారు. తిరుపతి లడ్డూ విషయంలో హిందువుల మనోభావాలు దెబ్బతినేలా చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఇకపై వైఎస్సార్‌సీపీపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు అవసరం


అస్వస్థతకు గురైన చిన్నారిని పరీక్షిస్తున్న చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతి

చింతపల్లి: చిన్నారుల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతి అన్నారు. జి.మాడుగుల మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన నెలల చిన్నారికి పసరు మందు పట్టడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో తల్లిదండ్రులు ఈ చిన్నారిని చింతపల్లి ఆస్పత్రికి తీసుకురాగా ఆ చిన్నారికి ఎస్‌ఎన్‌సీయూలో ఉంచి అత్యవసర వైద్యం అందించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లల వైద్య నిపుణులు ప్రభావతి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో మూఢనమ్మకాల కారణంగా నవజాత శిశువులు, నెలల చిన్నారులకు పసరు, చెక్క మందులు పడుతున్నారని, వీటిని వినియోగించడం వల్ల చిన్నారులు అస్వస్థతకు గురై మృత్యువాత పడే అవకాశాలున్నాయన్నారు. చిన్నారుల ఆరోగ్యం విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఏదైనా అనారోగ్యం సంభవిస్తే తక్షణమే ఆస్పత్రిలో చేర్చి వైద్యం అందించాలని ఆమె కోరారు.

పాఠశాలలో వాటర్ ట్యాంకు ఏర్పాటు



రాజవొమ్మంగి పాఠశాలలో వాటర్‌ట్యాంకు, కుళాయిలను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని అల్లూరి జిల్లా పరిషత్ పాఠశాలలో వాటర్ ట్యాంకు, కుళాయిలను పూర్వ విద్యార్థులు ఏర్పాటుచేశారు. పాఠశాలలో రన్నింగ్ వాటర్ సదుపాయం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పాఠశాల పూర్వ విద్యార్థులు తమ వంతు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఇందులో భాగంగా పాఠశాలకు చెందిన 2004–05 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆ బడిలో సుమారు రూ.50వేల వ్యయంతో వాటర్ ట్యాంకు ఏర్పాటుతో పాటు పైపులైన్, వాష్‌బేసిన్లు, ట్యాప్‌లను ఏర్పాటుచేశారు. పాఠశాల పట్ల పూర్వ విద్యార్థుల చూపిన ఔదార్యానికి పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయుడు సూర్యనారాయణ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అంతా ఒక చోట చేరి సందడి చేశారు. సాయంకాలం వరకు పాఠశాలలోనే గడిపి ఇంటిముఖం పట్టారు. ఇదే విధంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు.

అరకులోయలో కుక్కల బెడద


అరకులోయ-విశాఖ ప్రధాన రహదారిలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

అరకులోయ రూరల్: పట్టణ పరిధిలో వీధి కుక్కల బెడద మరింత పెరిగింది. వివిధ గ్రామాల నుంచి కుక్కల సంఖ్య మరింత పెరుగుతుంది. పలు వీధులతో పాటు ప్రధాన రహదారుల్లో గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తూ ద్విచక్ర వాహనదారులు, పాదచారులపై దాడులు చేస్తున్నాయి. వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు, వీధిల్లో చిన్న పిల్లలు ఆడుకునేందుకు కూడా వీలులేకుండా ఉంటుంది. బయటకు వచ్చేందుకు స్థానికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వ విఫలం


ఎల్.బి.కిరణ్‌కుమార్

అరకులోయ రూరల్: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అల్లూరి జిల్లా అధ్యక్షుడు ఎల్.బి.కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో దౌర్భాగ్యమైన పాలన సాగుతుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వంద రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు ఊసే లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు హామీలకే పరిమితమాయ్యయని చెప్పారు. అబద్ధాలకే అంబాసిడర్ కూటమి ప్రభుత్వమన్నారు. ప్రజా సంక్షేమాన్ని మరచిన కూటమి నాయకులు అరాచక పాలన నడిపిస్తున్నరన్నారు. ఇప్పటికే కూటమిపై ప్రజల వ్యతిరేకత మొదలైందన్నారు. మోసపూరిత మాటలు చెప్పి ప్రజల నుంచి తప్పించుకోలేరన్నారు. రెడ్‌బుక్స్ పేరుతో రాష్ట్రంలో రౌడీపాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజాగ్రహం తప్పదన్నారు.

26న మండల సమావేశం

వై.రామవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 26న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన ఆరోజు ఉదయం గం. 10.30లకు నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధుల హాజరుకావాలని కోరారు.

ఢిల్లీ సదస్సుకు ఎంపీడీవో పయనం

వై.రామవరం: నీతిఅయోగ్ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 23న నిర్వహించనున్న వర్కుషాపులో పాల్గొనడానికి ఎంపీడీవో కె.బాపన్నదొర కు ఆహ్వానం అందింది. నీతిఅయోగ్ గ్రామ సభల ద్వారా సర్వేలు, సమస్య సమాచారాన్ని సభలో తెలియజేస్తామన్నారు. ఆయన ఆదివారం ఢిల్లీ బయలుదేరారు.